"మిమ్మల్ని స్వర్గంలో విహరింప జేసే రోజు రేపే"

ఆమె ముఖం అగ్నిగుండంలా తయారైంది.

"ఎందుకంటే మీకు ఆరు నెలల అద్దె ఎడ్వాన్స్ యిస్తున్నాం. పాత బాకీ కూడా తీర్చి"

"ఉద్యోగం మళ్ళీ వచ్చిందా మీకు?" తులసిని అడిగిందామె అనుమానంగా.

"కాదు.....తనకి వచ్చిందట"

"నేన్నమ్మను"

"అందుకే రేపటివరకూ ఆగమన్నాను. ఇంక మీరు దయచేసి బయటికెళ్తే మేమిద్దరం శ్రోతలు కోరిన కార్యక్రమం ప్రారంభిస్తాం. శ్రోత తలుపు వెనుకగల భవాని.

శ్రీపురం కాలనీనుంచీ........."

సురేష్ మళ్ళీ తులసిని చుట్టేయబోయాడు.

"నువ్వా వుద్యోగానికి వెళ్ళదల్చుకుంటే నాతో మాట్లాడద్దు..." అతనిని దూరంగా నెడుతూ అందామె.

"సంసారం చెయ్యటానికి ముఖ్యం మాటలు కాదు......"

"నన్ను 'టచ్ ' చేసినా వూరుకోను"

"కుంతి....సూర్యుడు టైప్ ట్రై చేద్దాం"

విశ్వప్రయత్నం చేసి నవ్వాపుకుంది.

"నువ్వెన్నయినా చెప్పు నన్ను వదలి వెళ్ళటానికి వీల్లేదు."

"ఇదంతా ఎవరికోసమనుకుంటున్నావు?"

"నాకవసరం లేదని చెప్తున్నాగా."

"మరెలా బ్రతుకుదాం"

"మా ఇంటికెళ్దాం! కొన్నాళ్ళు మా వాళ్ళు ఆదుకుంటారు."

"నేను మీ పిల్లలకి పాలు పెట్టి మీ అమ్మానాన్నల కాళ్ళు పిసకాలి అంతేగా!"

"డోంట్ టాక్ లైక్ దట్"

సంభాషణ తెగటమూ లేదు.....ముడి పడటమూ లేదు. ఎన్ని రోజులయినా అలాగే కొనసాగేట్లుంది. ఇంట్లో నుంచి బయటికి పరుగెత్తటం తప్ప గత్యంతరం కనిపించలేదు సురేష్‌కి. తులసిని వదిలి వెళ్ళడం తనకూ ఇష్టం లేదు. కానీ తప్పదు...నిర్ణయం తీసుకున్నాక.

* * * *

రాజ్యలక్ష్మి గది తలుపు తెరచింది.

"ఇప్పుడే బయల్దేరుతున్నాను ఇంతలో వచ్చారు మీరు"

"ఎక్కడికి?"

"మామూలేగా....మీ వుద్యోగం దొరికినట్లేనా?"

"ఆ... మీకు థ్యాంక్స్ చెప్దామని వచ్చాను. థ్యాంక్స్ గివింగ్ సెరిమనీ ఎప్పుడు ఏర్పాటు చేసుకుందామంటారు?"

"రేపు"

"రేపటికి మీరు బ్రహ్మాండమయిన పార్టీ యిచ్చే స్థితిలో వుంటారనుకుంటాను"

"లెటజ్ హోప్ సో......"

"సహదేవ్ మీకు మంచి ఫ్రెండా?"

"ఎందుకలా అడిగారు?"

చెప్పబోయి ఠక్కున ఆగిపోయాడతను. సహదేవ్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయ్.

ఎవరికీ ఏమీ చెప్పకూడదు తన వుద్యోగం గురించి అది వార్నింగ్.

"మరేంలేదు జీతాలూ అవీ కరెక్ట్‌గా 'పే' చేస్తారా అని"

ఆమె నవ్వింది "పని నచ్చాలేగానీ దేనికీ లోటుండదు వాళ్ళదగ్గర. మరి నేను వెళ్ళనా?".

"షూర్"

"రేపు తప్పకుండా వస్తున్నారు కదూ"

"తప్పదు కదా! కొంతయినా మీ ఋణం తీర్చేసుకుంటే......."

రోడ్డుమీద కొచ్చాడు. రాజ్యలక్ష్మి కారులో వెళ్ళిపోయింది. ఎయిర్ కండిషన్ కారు.

ఎమ్మే సోషియాలజీ రోడ్డుమీద నడుస్తున్నాడు. డెబనీర్ బార్ దగ్గర బోర్డ్ మీద రాసి వుంది. డార్క్‌డెవిల్ అండ్ పార్టీ ఆర్కెస్ట్రా-టు నైట్ అండ్ ఎవ్విరి నైట్. లోపలకు తనను వెళ్ళనీరు. ఒకవేళ వెళ్ళినా డార్క్‌డెవిల్ ఫుల్ లోడ్‌లో వుంటాడు.

రోడ్ల వెంబడి తిరుగుతూనే గడిపాడతను. ఇంటికి చేరుకునేసరికి అర్థరాత్రి అయింది. తులసి కింద పడుకుంది. తనూ పక్కనే పడుకోబోతే లేచి మరో మూల కెళ్ళింది

తెల్లారేలోగా ఇద్దరూ ఇల్లంతా తిరగటం అయిపోయింది.

ఓ పక్క భయం మరో పక్క దిగులూ పెరిగిపోతున్నాయి. నిజంగా లక్ష రూపాయలు యింకొద్ది గంటల్లో తులసి పేర అకౌంట్ కొస్తుందా? తనకెందుకో యింకా నమ్మకం కలగటం లేదు.

డబ్బు వుంది అని బ్యాంక్ వాళ్ళు చెప్పేవరకూ తన నమ్మడు.

తులసి తనతో మాట్లాడకపోవటం మరింత చిత్రవథగా వుంది. ఆడమగగా కలసివుండటం ప్రారంభించాక యిది మొదటిరోజు ఇలా మానసికంగా, శారీరకంగా దూరంగా గడపటం.

క్రమేపీ చీకట్లు విచ్చుకుంటున్నయ్.

నిద్ర, ఆందోళన, విచిత్రమైన పరిస్థితి .

తులసికి అప్పుడే నిద్ర పడుతున్నట్లుంది.

"తులసీ "

"ఊ"

"ఇంకా కోపం పోలేదా?"

"................."

కొంత ధైర్యం వచ్చింది. కొంచెం మెత్తబడిందని అర్థం ......మౌనానికి.

ఆమెకు దగ్గరగా జరిగాడు.

"తులసీ!"

"................."

ఆమె కళ్ళల్లో నీళ్ళు మెరుస్తున్న విషయం పూర్తిగా దగ్గరయ్యాక తెలిసింది.

"తులసీ! ఈ ఒక్కసారికి నన్ను క్షమించు. ఇందంతా మన కోసం చేస్తున్నాను"

హఠాత్తుగా ఉప్పెన వస్తున్నట్లు అతని మీదకు వచ్చిందామె.

జుట్టు ఇద్దర్నీ కప్పేసింది. ఆమె కన్నీరు అతని కళ్ళల్లోకి జారుతోంది.

అలా ఎంతసేపు గడిచిందో తెలీదు. టైము పదవుతోండగా స్పృహలోకొచ్చారు.

"గంగాభవాని తలుపు తట్టలేదేం ఇవాళ?" అడిగాడు సురేష్ .

"అదే ఆశ్చర్యంగా వుంది"

తులసి తెరచింది. మొక్కలు పాదులు తీస్తోందామె. తులసిని చూసి చిన్నగా నవ్వింది. ఆమె కళ్ళు జ్యోతుల్లా ఎర్రగా వున్నాయ్.

"స్వర్గంలో విహరించే రోజిదే. గుర్తుంచుకోండి"

గంగాభవాని విసుక్కోలేదు. కోపగించుకోనూ లేదు. తనలో తాను నవ్వుకుంది.

అతనికి మతిపోయినట్లయింది. ఎప్పుడూ లేనిది ఆమె ఎందుకలా నవ్వింది? ఎందుకు తన మాటలకు రిటార్ట్
చేయలేదు?

రాత్రంతా తనూ, తులసీ దూరంగా గడపటం చూసి వుంటుంది.

బ్యాంక్‌కు వెళ్ళాడు.

"ఎస్" అక్కడి క్లర్క్ చిరునవ్వుతో ప్రశ్నార్థకంగా చూసింది.

"9689 బ్యాలెన్స్ ఎమౌంట్ ఎంతుందో చెప్తే....."

"మీరెవరు?"

"తులసి ఫ్యూచర్ హజ్బెండ్ని"

"అంటే ఇప్పుడు......."

"టెంపరరీ హజ్బెండ్ని. ఇంకా కన్ఫర్మేషన్ అవలేదు"

ఆమె ముఖంలో చిరునవ్వు ఆరిపోయింది.

లెడ్జర్ తెరచి చూసింది.

"ఒక లక్షా అయిదు రూపాయలు"

సురేష్కి చెమటలు పట్టినయ్. కళ్ళు తిరుగుతున్నట్లనిపించి కౌంటర్ గట్టిగా పట్టుకున్నాడు.

"వన్ లాక్" తన కలలో కూడా పొందలేని మొత్తం.

భయం శరీరమంతా రక్తంతో పాటు పాకుతోంది.

"థా.....థాంక్యూ....." అనేసి బయటకు నడిచాడు. అడుగులు తేలిపోతున్నట్లున్నయ్ తులసి బయట కూల్డ్రింక్ షాప్ దగ్గర నిలబడి వుంది.

"ఏమయింది" అడిగిందామె.

"వన్ లాక్ బ్యాలెన్స్"

ఆమె ఏమీ మాట్లాడలేదు. తన బ్యాగ్లోంచి ఓ చెక్కు తీసి అతని కిచ్చింది.

మళ్ళీ బ్యాంక్లోకెళ్ళి అయిదువేలు క్యాష్ తీసుకొచ్చాడు. ఇద్దరు హోటల్ కెళ్ళారు.

"ఇది మన మొట్టమొదటి ఖరీదయిన అనుభవం తులసీ! లెటజ్ ఎంజాయ్ టు ది మాక్సిమమ్ " అమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని మృదువుగా నొక్కుతూ అన్నాడు.

సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారిద్దరూ. గంగాభవాని చీకట్లో నిలబడి వుంది .

"కరెంట్ పోయింది. కాండిల్స్ తెచ్చిస్తారా ఆ షాప్కెళ్ళి?" సురేష్ నడిగిందామె.

"మనకు లైటు అవసరమా?"

ఆమె ఇంట్లో కెళ్ళిపోయింది జవాబివ్వకుండా.

అతన రోడ్డుమీదకు వచ్చాడు.

రోడ్డంతా కూడా చీకటే. ఓ పక్క ఆనందం మరోపక్క భయం. చాలా అనీజీగా వుంది. హఠాత్తుగా నిద్ర వస్తున్నట్లనిపించసాగింది అతనికి.

బహుశా రాత్రంతా నిద్ర లేకపోవటం వల్లనేమో.

అయినాగానీ ఇంత మత్తు యింత హఠాత్తుగా ఎందుకొస్తుంది? కళ్ళు మూతలు

పడిపోతున్నాయి .  మెదడు మొద్దుబారిపోతోంది.

ఏం జరుగుతోందో  తనకు? ఎందుకిలా అవుతోంది? అతనికి అర్థమయింది తనింక నడవగలగడం అసంభవం.